క్లుప్తంగా

రెడ్డెమ్మతల్లీ.. కరుణించి కాపాడవమ్మా..!



సంతానం కోసం వరపడిన మహిళలు

గుర్రంకొండ : రెడ్డెమ్మతల్లీ కరుణించి కాపాడు తల్లీ అంటూ భక్తులు మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని మొక్కుకున్నారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధి పొందిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. ఆలయంలో పలువురు అన్నదానం నిర్వహించారు. రాయలసీమ జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికి తరలి రావడం విశేషం.

నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: వర్షాలు బాగా కురిసి, పాడి పంటలు సంవృద్ధిగా పండి నియోజకవర్గంలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని వినాయకుడిని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. వినాయక చవితిని గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.



ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులకు ఎమ్మెల్యే నవాజ్‌బాషా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్య, అష్టైశ్వర్య సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ వినాయకుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.

కంటి ఆపరేషన్లకు 20 మంది ఎంపిక



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పీలేరురూరల్ : కంటి ఆపరేషన్లకు 20 మంది ఎంపికైనట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రనాథరెడ్డి, సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక ప్రసాద్ హాస్పిటల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. మొత్తం 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు డాక్టర్ నందిని, లయన్స్‌క్లబ్ కోశాధికారి జయచంద్రనాయుడు, సభ్యులు ప్రసాద్, బాలాజీ, పామిడి మహేష్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆది వారం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వం జీపీఎస్ విధానాన్ని అమలుపరచడానికి ఉత్సాహం చూపుతోంతుందన్నారు. పాత పెన్షన్ మాత్రమే ఆమోద్యయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికుమార్, సుజాత, నరసింహారావు, చెన్నయ్య, శ్రీనివాసులు, రమణ, చంద్ర ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు

విఘ్నేశ్వరా.. నమోనమః

- వాడవాడలా వినాయక మండపాలు
- బహురూపాల్లో కొలువుదీరుతున్న గణనాథులు

మదనపల్లె సిటీ : ఏడాదిలో ఎన్ని పండుగలు వచ్చినా వినాయకచవితి తెచ్చే సంబరం..సంతోషం మాటల్లో చెప్పలేనిది. పల్లె నుంచి పట్టణందాకా మురికివాడల నుంచి ఖరీదైన అపార్ట్‌మెంట్ల వరకు ఎవరిస్థాయిలో వారు అంబరాన్నంటేలా చేసుకునే వేడుక. ఐదు రోజుల పాటు సంతోషాల జడిలో తడిసి...ఏడాది పాటు ఆ జ్ఞాపకాలను నెమరేసుకుని తిరిగి రెట్టించిన ఉత్సాహంతో గణేష్ చవితికి సిద్ధమయ్యే అరుదైన పండుగ. భాద్రపద మాసంలో వచ్చే వినాయకచవితి స్వామివారిని బహురూపాల్లో రూపొందించి పూజలు చేస్తారు. సోమవారం పండుగ. మదనపల్లెలో ఆదివారమే వినాయకుడి ప్రతిమలను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లారు. పర్యావరణ స్పృహతో స్వచ్ఛంద సంస్థలు మట్టి ప్రతిమలు వితరణ చేశారు. ఇవే కాకుండా 10-15 అడుగుల భారీ విగ్రహాల వరకు కొనుగోలు చేసి ట్రాక్టర్లు, ఆటోలు తదితర వాహనాల్లో తీసుకెళ్లారు.

అందంగా తీర్చిదిద్దుతున్న మండపాలు

మదనపల్లె పట్టణంలో సుమారు 60 వరకు మండపాలు సిద్ధం చేశారు. విద్యుత్‌లైట్లు ఆకర్షణగా నిలుస్తున్నాయి. భారీ సెట్టింగులు వేస్తున్నారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కళాకారులతో సెట్టింగ్ వేయించారు. పట్టణంలోని 35 వార్డుల్లో వినాయకచవితి కమిటీ పేరుతో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు.

కిటకిటలాడిన దుకాణాలు

వినాయకచవితి పండుగ సందర్భంగా పూల దుకాణాలు కిటకిటలాడాయి. పండుగ కోసం వినాయకుని ప్రతిమలు, పూజా సామగ్రి, చెరకు గడలు, పత్రి, మామిడి ఆకులు, ఆరటి పిలకలు, టెంకాయలు, మారేడు కాయలు, వెలగ కాయలు అమ్మకాలు జోరందుకున్నాయి. పూలు, పండ్ల ధరలు అమాంతం పెరిగిపోయాయి.





మండపం వద్దకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న వినాయకుని విగ్రహం, బెంగళూరు బస్టాండులో కిటకిటలాడుతున్న పూల మార్కెట్

ఆనాటి హృదయాల ఆనంద గీతం..!!



కురబలకోట హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కురబలకోట : బాల్యం జీవితంలో మధురమైనది. ఆపై మరుపురానిది. ఒకే తరగతిలో చదివి వివిధ వృత్తి, ఉద్యోగ, వ్యాపార ఇతర రంగాల్లో ఏ స్థాయిలో ఉన్నా చిన్ననాటి మిత్రులు కనిపిస్తే మక్కువతో యోగ క్షేమాలు అడిగి తెలుసుకుంటారు. బడిలో చేసిన చిలిపి చేష్టలు, అల్లరి పనులు గుర్తు చేసుకుంటారు. ఆనందంలో మునిగితేలుతారు. కురబలకోట జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఇదే జరిగింది. ఆ పాత మధుర జ్ఞాపకాల దొంతరలు కన్పించాయి. ఆ హైస్కూల్‌లో 1990-91 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. గురువులు కృష్ణమూర్తి, చెంగల్ రావు, భారతిని ఘనంగా సత్కరించారు. మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారు నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మహమ్మద్, కె.ఖలీల్, టీకే ప్రేమ కుమార్, ఎల్‌కె మహమ్మద్, ముత్ర దామోదర్ రెడ్డి, శ్రీధర్ కుమార్, ఎంజి రమేష్, ఎల్‌కే ఆజాద్, వెంకట్రమణ, శ్రీనివాసులు, అశోక్, బాబ్‌జాన్, బావాజీ, పి.వెంకటాచలపతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం



క్రికెట్ బ్యాట్‌తో ఉత్సాహ పరుస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ కలసి కట్టుగా అటు క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేసారు. ఆదివారం మండలంలోని టి.సదుంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన వలంటీర్ జయచంద్ర జ్ఞాపకార్థం పంచాయతీలోని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు ఏర్పాటు చేసిన ఓపన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంటును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టోర్నమెంటులో గెలుపొందిన వారికి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ రవిచంద్రారెడ్డి రూ. 22,222లు, ఉప సర్పంచ్ పీఎస్ మధు రూ.11,111లు, నవీన్‌కుమార్‌రెడ్డి రూ.5,555ల బహుమతులు ప్రకటించడం బొమ్మే వెంకట్రమణ భోజన సౌకర్యం సమకూర్చడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు మహమూద్, శివన్న, సుబ్బిరెడ్డి, రియాసత్ అలీఖాన్, రఘునాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మునిరెడ్డి, చంద్రశేఖర్, గిరీస్వామి, సుబ్రమణ్యంరెడ్డి, సాదిక్, ప్రదీప్, గిరీష్, మంజు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు ఐడీ కార్డుల పంపిణీ



మదనపల్లె టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె : పట్టణంలోని టూ వీలర్ మెకానిక్‌లకు ఐడీ కార్డులు పంపిణీ చేసినట్లు మదనపల్లె డివిజన్ టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని సీటీఎం రోడ్డులో టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా టూ వీలర్ మెకానిక్ షాపులను ఏర్పాటు చేసుకుని సొంత కాళ్ల మీద నిలబడేందుకు ప్రయత్నిస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రమణ, కార్యదర్శి సాంబిరెడ్డి, ఉపాధ్యక్షులు రాము, బాలాజీ, చలపతి, కోశాధికారి మధురెడ్డి, నాగరాజు, ముని, సుధ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుని ప్రతిమలు అందజేత



మట్టి వినాయకుని ప్రతిమను అందజేస్తున్న హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబకర్‌సిద్ధిక్

మదనపల్లె సిటీ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలో ఆదివారం హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయకుని ప్రతిమలు పంపిణీ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న సంస్థ కార్యాలయంలో భక్తులకు ఉచితంగా అందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఏడాది పండగ ముందు రోజు అందజేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు అబూబకర్‌సిద్ధిక్ తెలిపారు.

పీలేరులో..

పీలేరు : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పీలేరులో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది పీలేరు పట్టణంలో 100కు పైగా గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ సాయిబాబా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మట్టి గణేష్ విగ్రహాలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఎన్.వి. చలపతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కంభం భాస్కర్‌రెడ్డి, సంఘం నాయకులు వీరయ్య, నరసింహారెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తుశాఖ ఈఈగా యుగంధర్



ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈఈ యుగంధర్

మదనపల్లె : విద్యుత్‌శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ)గా యుగంధర్ బాధ్యతలు చేపట్టారు. స్థానిక డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఆదివారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్‌లు స్వాగతం పలికారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఏడీఈగా పనిచేస్తున్న యుగంధర్ పదోన్నతిపై మదనపల్లె ఈఈగా బదిలీపై వచ్చారు. గతంలో యుగంధర్ కలికిరి, సదుం, పీలేరులో ఏఈగా, విజయవాడ, కడప, తిరుపతి, అనంతపురంలో ఏడీఈగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈఈగా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ ఎమ్మెల్యే నవాజ్‌బాషాను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

మున్సిపాలిటీలో శరవేగంగా అభివృద్ధి పనులు



25వవార్డులో అభివృద్ధి పనులకు భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : మున్సిపాలిటీలోని 35వార్డుల్లో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని 25వవార్డు సిద్ధమ్మ లేఅవుట్ కురవంక ఆంజనేయస్వామి గుడి నుంచి పొన్నూటిపాళ్యం రామిరెడ్డిపల్లె రోడ్డు వరకు సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి భూమిపూజ జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు సదాశివరెడ్డి, జిల్లా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. పూజాకార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్న సమయంలో నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లకు సంబంధించి మొదటి ఫేజ్‌లో రూ.85కోట్లు, రెండో ఫేజ్‌లో రూ.84కోట్లు నిధులు మంజూరుచేశారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలవడం ఖాయమన్నారు. కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, వెలుగుచంద్ర, చందూరెడ్డి, అడ్వకేట్ నాగమల్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, రామిరెడ్డి, పోతబోలు నాగరాజ, బావాజాన్ పాల్గొన్నారు.

రేపు ఆరోగ్య మేళా

తంబళ్లపల్లె : స్థానిక వైద్యవిధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఆయుష్మాన్‌భవ ఆరోగ్యమేళా జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ షబానాఫాతిమా తెలిపారు. రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు.